పద్మశాలి కుల సంఘం అధ్యక్షుడిగా రాజు

దుబ్బాక, నవంబర్7: దుబ్బాక మండలం రామక్కపేటలో గురువారం పద్మశాలి కుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీరామ్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శ్రీరామ్ విజయ్‌కుమార్, కోశాధికారిగా కొండ విఠోభ, కార్యదర్శిగా చౌకి భానుకుమార్, సహాయ కార్యదర్శిగా మంతెన రాజు, దైవశెట్టిగా శ్రీరామ్ హరిబాబు, ముఖ్య సలహాదారులుగా బల్ల పెంటయ్య, అవదూత రాజనర్సయ్య, అవదూత జగదీశ్, లగిశెట్టి నర్సింహులు, మంతెన దుబ్బారాజం ఎన్నికయ్యారు.

కళాకారుడికి ఆర్థిక సాయం

కొమురవెల్లి, నవంబర్ 7 : మండలంలోని ఐనాపూర్‌కు చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు పిన్నింటి రత్నం రచించిన పాటలు ప్రజాపాలన పుస్తకంలో చోటు దక్కడంతో గురువారం మాజీ సర్పంచ్ రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు అభినందనలు తెలిపి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు మల్లం బాలయ్య, కాయిత శ్రీనాథ్‌రెడ్డి, దండు నర్సింహులు, ఏర్పుల కృష్ణ, సున్నం కనకయ్య, పాశం యాదగిరి, కాగిత ఆగంరెడ్డి, మల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ టీచర్ మృతి

చేర్యాల, నవంబర్ 7 : పాఠశాలకు సకాలంలో చేరుకునేందుకు వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ద్విచక్ర వాహనానికి కోతి అడ్డు రావడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని వేచరేణి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పర్పాటకం ధర్మారెడ్డి (49) మండలంలోని చుంచనకోట గ్రామ పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చేర్యాలలో నివాసం ఉండే అతడు గురువారం రోజువారీగా విధులకు ఓలా బైక్ పై చుంచనకోటకు వెళ్తున్న క్రమంలో చేర్యాల,చుంచనకోట రహదారిలో బండపల్లి క్రాసింగ్ వద్ద ఒక్కసారిగా కోతి అడ్డంగా వచ్చింది. దాన్ని తప్పించేందుకు ఉపాధ్యాయుడు బైక్‌ను కంట్రోల్ చేసే క్రమంలో కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ టీచర్ ధర్మారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి భార్య శకుంత మద్దూరు మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.మృతుడికి భార్య, ఇంటర్ చదువుతున్న కుమారుడు, 8వ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.ప్రభుత్వ టీచర్ మృతికి ఉపాధ్యాయ సంఘాలు సంతాపం ప్రకటించాయి.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

చేర్యాల, నవంబర్ 7 : ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ వివిధ సర్వేలు, కమిటీల పేరిట కాంగ్రెస్ సర్కారు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంటి ఆరోపించారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ కులగణన దేని కోసమో కాంగ్రెస్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేవలం ఢిల్లీకి మూటలు అప్పగించేందుకు పనికిరాని మూసీపక్షాళన అంటూ నానా హంగామా చేస్తున్న రేవంత్ సర్కారుకు ప్రజలు సరైన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు. టైం పాస్ రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు తెలంగాణ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందన్నారు.

క్యాన్సర్‌ను తరిమికొడదాం

జగదేవపూర్ నవంబర్ 7: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుందామని మండల వైద్యాధికారి సత్యప్రకాశ్ సూచించారు. గురువారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పీహెచ్‌సీ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో మానవహారం చేపట్టి ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఆనంద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీమతి, పీహెచ్‌సీ స్టాఫ్, ఆశావర్కర్లు, మాస్టర్‌మైండ్ పాఠశాల ప్రతినిధులు నర్సింహులు, ప్రవీణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 7: మద్దూరులోని మోడల్ స్కూల్, కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ బోటనీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె గణేశ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీతో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ నెల 12వ తేదీ వరకు అభ్యర్థులు స్థానిక మోడల్ స్కూల్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట సీపీని కలిసిన మల్లన్న ఆలయవర్గాలు

చేర్యాల, నవంబర్ 7 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుని ఆలయానికి సహకరించాలని కోరుతూ మల్లన్న ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది గురువారం సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధను కలిశారు.ఆలయ ఈవో ఏ.బాలాజీ ఆదేశాల మేరకు ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్,ఏఈవో శ్రీనివాస్‌తో కూడిన ఆలయ బృందం సీపీతో పాటు అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా సీపీ ఆలయవర్గాలను స్వామి వారి కల్యాణోత్సవం, బ్రహ్మోత్సవాలు, పట్నంవారం, అగ్నిగుండం తేదీలు, తరలిరానున్న భక్తుల సంఖ్య, ఆలయ ఆధ్వర్యంలో చేయనున్న ఏర్పాట్లు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం సీపీ మాట్లాడుతూ మల్లన్న క్షేత్రంలో అన్ని సీసీ కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.క్షేత్రంలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సూపరింటెండెంట్ శ్రీరాములు, రవికుమార్, విరేశలింగం, అర్చకులు పాల్గొన్నారు.

సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్

బాలాజీ జిన్నింగ్ మిల్లుపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్, నవంబర్ 7: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలోని బాలాజీ జిన్నింగ్ మిల్లు యజమానులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై పత్తి రైతులను మోసం చేస్తున్నారని, వెంటనే మిల్లుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో రామ్మూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన పత్తిని మళ్లీ సీసీఐలో విక్రయాలు జరుపుతున్నారని, దీని వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. తేమ పేరుతో తూకం తక్కువ చేయడం, క్యాష్ కటింగ్ చేస్తూ రైతులను మోసానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ నాయకులు అయిలేని సంజీవరెడ్డి, జనగాం రాజ్‌కుమార్, పూదరి రఘుపతి, ఎలకంటి హన్మిరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కులగణన సర్వే

సిద్దిపేట, నవంబర్ 7: కులగణన సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించే ప్రక్రియ, కులగణన చేస్తున్న విధానాన్ని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పరిశీలించారు. పట్టణంలోని 34, 35 వార్డుల్లో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ కులగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. కౌన్సిలర్ గుడాల సంధ్యాశ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 7: కులగణనపై రెండో రోజూ కూడా సర్వే కొనసాగుతున్నది. పట్టణంలోని 20వ వార్డుల్లో సూపర్ వైజర్లు, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు ఆయా కుటుంబాల నుంచి సమాచారాన్ని సేకరించారు. గురువారం సైతం ఆయా ఇండ్లకు వెళ్లి స్టిక్కర్లు వేయడంతోపాటు కుటుంబాలు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని తీసుకుని నమోదు చేశారు. తిరిగి పూర్తి స్థాయి సమాచార సేకరణ కోసం మళ్లీ వస్తామంటూ కుటుంబాలకు వివరించారు.

హుస్నాబాద్‌టౌన్: పట్టణంలోని 20వ వార్డులో కులగణన సర్వేచేస్తున్న బృందం

నారాయణరావుపేటలో..

నారాయణరావుపేట, నవంబర్ 7 : మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సమగ్ర కుటుంబ సర్వే పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు.

మందు బాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్,నవంబర్ 7 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం గురువారం జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం.. సర్కిల్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్,నాగదేవత ,ముస్తాబాద్ చౌరస్తాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు.ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మంది మందు బాబులను పట్టుకున్నామన్నారు. సిద్దిపేట స్పెషల్ సెంకడ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపర్చగా రూ.14 వేల జరిమానా విధించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాల ఆవిష్కరణ

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 7 : చెకుముకి టాలెంట్ టెస్ట్ ద్వారా సైన్స్‌పై విద్యార్థులకు మరింత ఆసక్తి పెరుగుతుందని కొండపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.లక్ష్మి అన్నారు. గురువారం పాఠశాలలో చెకుముకి లాటెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభా పరీక్షను ప్రతి సంవత్సరం జ్ఞానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్, డిసెంబర్‌లో అన్ని పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం చెకుముకి టస్ట్‌లో 10వ తరగతిలో నిఖిత, 9వ తరగతిలో వి.ప్రణీత, 8వ తరగతిలో సీహెచ్ సృజన ప్రథమ స్థానంలో నిలిచారు. వారిని అభినందించడంతో పాటు ఈ నెల 21న జరిగే మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు వాళ్లను పాఠశాల నుంచి పంపునున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదగిరి, టాలెంట్ టెస్ట్ కో ఆర్డినేటర్స్ హైమవతి, భాగ్యలక్ష్మి, రజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి: డీబీఎఫ్

గజ్వేల్, నవంబర్ 7: దేశ వ్యాప్తంగా కేంద్రం కుల గణన చేపట్టాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లోని అంబేద్కర్ భవనంలో ''కుల గణనను స్వాగతిద్దాం సామాజిక న్యాయం సాధిద్దాం'' అంటూ చైతన్య సదస్సును డీబీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సామాజిక న్యాయానికి నాంది అవుతుందన్నారు.సర్వేపై అధికారులు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, అంబేద్కర్ అభయహస్తం పేరుతో ప్రతి కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సహాయ పథకం నేటికి ప్రారంభించలేదన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి, జిల్లా కార్యదర్శి వేణు, నాయకులు రాములు, లాలయ్య, పుట్ట రాజు, గణేశ్, కనకప్రసాద్, కిరణ్, సతీశ్ పాల్గొన్నారు.

చెస్ క్రీడకు విద్యార్థుల ఎంపిక

గజ్వేల్, నవంబర్ 7: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ క్రీడకు మండలంలోని అహ్మదీపూర్, జాలిగామ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. 68వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా చెస్ పోటీలకు మండలంలోని అహ్మదీపూర్ పాఠశాలకు చెందిన మల్లికార్జున్ అండర్-17 విభాగంలో ఎంపికైనట్లు హెచ్ఎం సుగుణాకర్ తెలిపారు. జాలిగామ పాఠశాలకు చెందిన వర్షిక, జానవి అండర్-17విభాగం, తరుణి అండర్-14విభాగంలో ఎంపికైనట్లు హెచ్ఎం బస్వారాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల పీడీలు నగేశ్, భవితను హెచ్ఎంలు అభినందించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గజ్వేల్, నవంబర్ 7: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు చోటుకున్న సమయంలో ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విపత్తులు, అగ్ని ప్రమాదాల నుంచి ఎలా భయటపడాలో డెమో ద్వారా అగ్నిమాపక సిబ్బంది వివరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూఅగ్నిప్రమాదాలు, విపత్తుల నుంచి ప్రజలను కాపాడుతున్న అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞులై ఉండాలని సూచించారు. ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది రవికుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిద్దిపేట టౌన్,నవంబర్ 7 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి గాంధీ దవాఖానలో గురువారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సర్కిల్ పరిధిలో రెండు రోజుల క్రితం రాజీవ్‌రహదారి లింగారెడ్డిపల్లి శివారులో ఆగిఉన్న బస్సును ఢీకొనగా వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. అతడిని మొదటగా సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు గాంధీకి రిఫర్ చేశారన్నారు.అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని వివరించారు. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచామని, మృతుడి వయస్సు 30నుంచి 35 వరకు ఉంటుందన్నారు. ఎత్తు 5.5కలిగి ఉన్నాడని, నీలం రంగు నెక్కర్, గోధుమ రంగు కలర్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. సంబంధికులు ఎవరైనా గుర్తుపడితే సెల్: 8712667314 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని మృతదేహం

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 7: ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లోని రాజరాజేశ్వరస్వామి, ఆంజనేయస్వామి దేవాలయ 23వ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అర్చకులు తిగుళ్ల రామమూర్తిశర్మ వైదిక నిర్వహణలో ఉదయం అభిషేకం, చండీహవనం, స్వస్తివాచకం, రుతిగ్వరణం, దేవతాహవనం నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు పార్నంది ఆంజనేయశర్మ, నర్సింహామూర్తి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు సిరిమల్ల భాస్కర్, ఉపాధ్యక్షులు జెల్ల శ్రీనివాస్, భీంరెడ్డి జగత్‌రెడ్డి, కార్యదర్శి కోరండ్ల వెంకటేశ్, సహాయ కార్యదర్శి టి. శేఖర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సరికొండ రాంరెడ్డి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోమంలో పాల్గొన్న భక్తులు

కొనుగోలు కేంద్రాల పరిశీలన

బెజ్జంకి, నవంబర్7: మండలంలోని రేగులపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య, డీఎస్‌వో తనూజ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎండీవో ప్రవీణ్, సీసీ సారయ్య పాల్గొన్నారు.

చిన్నకోడూరు మండలంలో..

చిన్నకోడూరు, నవంబర్ 7 : పెద్దకోడూరు, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో పీడీ జయదేవ్ ఆర్య, డీఎం హరీశ్, డీఎస్‌వో తనూజ, ఐకేపీ ఏపీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో కొనుగోళ్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

ఆయిల్ పామ్‌సాగుతో అధిక ఆదాయం

జగదేవపూర్, నవంబర్7: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని హార్టికల్చర్ అధికారి సౌజన్య, మండల వ్యవసాయాధికారి వసంతరావు తెలిపారు. గురువారం మండలంలోని చాట్లపల్లిలో పర్యటించిన వారు గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో ఏఈవో కృష్ణమూర్తి,ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, కార్యదర్శి సాయిబాబా, రైతులు నారంరెడ్డి, నర్సింహులు తిరుపతి, పద్మ, యాదగిరి పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

మిరుదొడ్డి, నవంబర్ 7 :ఆయిల్‌పామ్ సాగుచేయడం వల్ల రైతులు అధిక ఆదాయం పొందవచ్చని దుబ్బాక ఏడీఏ మల్లయ్య అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం కొండాపూర్‌లో ఆయిల్‌పామ్ తోటను సందర్శించి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ కల్పిస్తుందన్నారు. జిల్లాలో 11 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌సాగవుతుందన్నారు. రైతులు ఆయిల్ పామ్ తోటల పై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారులపై ప్రభుత్వం చిన్నచూపు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్7: మత్స్యకారులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామ మత్స్యకారుల సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గూళ్ల కొంరెల్లి, గవ్వల గణేశ్ అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక చెరువు, కుంటల్లో చేపపిల్లలు వదలకపోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువు, కుంటల్లో ఉచితంగా చేపపిల్లలను వదలడంతో పాటు చేపలు అమ్ముకునేందుకు వీలుగా రాయితీపై వాహనాలు అందించిందని గుర్తు చేశారు. వారివెంట సొసైటీ సభ్యులు గూళ్ల శ్రీను, కిష్టయ్య, నీరటి రమేశ్ ఉన్నారు.

కొండాపూర్‌లో పశువైద్య శిబిరం సక్సెస్

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్7: ధూళిమిట్ట మండలం కొండాపూర్‌లో బైరాన్‌పల్లి పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బైరాన్‌పల్లి, మద్దూరు పశువైద్యాధికారులు డాక్టర్ ఉషారాణి, హరికిషన్ పశువులకు వైద్య చికిత్సలు చేశారు. అంతకుముందు పశువులకు సంక్రమించే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏ రాజశేఖర్, ఓఎస్ వినయ్, గోపాల మిత్రలు ఆంజనేయులు, రాములు, రైతులు పాల్గొన్నారు.

గాడిచర్లపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

సిద్దిపేట కమాన్, నవంబర్ 7: సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు గాడిచర్లపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. నాయకులు తిరుపతి, సత్తయ్య, ఎల్లయ్య, యాదయ్య, మల్లేశం పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కుందన్‌వానిపల్లిలో రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు

అక్కన్నపేట, నవంబర్7: రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో పాటు కూరగాయలు, వాణిజ్యపంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి రాధిక, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ అన్నారు. గురువారం వ్యవసాయశాఖ ఏఈవో శ్రీలత ఆధ్వర్యంలో యాసంగి పంటలు, యాజమాన్య పద్ధతులపై ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ద్వారా మండలంలోని కుందన్‌వానిపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా కూరగాయ విత్తనాలు అందజేశారు. హార్టికల్చర్ అధికారి నాగరాజు, బాలజీ, ఏడీఏ శ్రీనివాస్, ఆయిల్‌ఫెడ్ ఆఫీసర్ రవళి, ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల సీఈవో నారదాసు ఈశ్వర్, స్వామిరెడ్డి, సారయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

హుస్నాబాద్, నవంబర్ 7: హుస్నాబాద్‌లో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు మండల విద్యాధికారి బండారి మనీల తెలిపారు. 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగే పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక ఫిజికల్ డైరెక్టర్లు, అధికారులతో కలిసి హుస్నాబాద్‌లోని మినీస్టేడియంలో ఆమె పరిశీలించారు. రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి పోటీలు ఇక్కడే నిర్వహించామని, రాష్ట్ర స్థాయి పోటీలు కూడా ఇక్కడే జరగడం హర్షణీయమన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా, అతిథులుగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

మిరుదొడ్డి: భూంపల్లిలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కొండపాక: లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 7 : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ కొండపాక మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం కొండపాక మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబోయిన కనకయ్య, చిక్కుడు భాను, బాబు, కెమ్మసారం శ్యామ్, నవీన్, చంద్, రాకేశ్ పాల్గొన్నారు.

భూంపల్లిలో...

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 7 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లిలో బాధిత కుటుంబాలకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సొల్లు రేణుకకు రూ.16 వేలు, ముత్తయ్యకు రూ.